www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 31 డిసెంబరు 2022
5
పశ్చిమ గోదావరి



టిడ్కో గృహాలకు రుణాలు మంజూరు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో టిడ్కో గృహాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బ్యాంకు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కన్సల్టేటివ్ జిల్లాస్థాయి రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 13,636 మంది టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు రూ.471.42 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా తీసుకోగా ఇప్పటి వరకూ 9503 మందికి రూ.253.31 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఉత్పత్తి, సేవ, బిజినెస్ రంగాలను ప్రోత్సహించేందుకు ముద్రరుణాలు ఎక్కువగా మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం నాబార్డ్ పొటెన్షియల్ లింకే క్రెడిట్ ప్లాన్ 2023-24 బుక్ లెట్లను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జెసి జెవి మురళి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రీజినల్ హెడ్‌టి.శ్రీరామ చంద్రమూర్తి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌డిఓ ఎ.నాగప్రవీణ్, నాబార్డు డిడి ఎం.అనిల్‌కాంత్ పాల్గొన్నారు.

సమస్యలపై చర్చిస్తారా..!

- నేడు ఏలూరులో ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- హాజరుకానున్న మంత్రులు, ఎంఎల్‌ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు
- పింఛన్ల రద్దు, ధాన్యం కొనుగోలు వంటి సమస్యలతో జనం సతమతం
- కౌలురైతులకు రుణాలు, ఆయిల్‌పామ్ రైతులకు మొక్కలు అందని పరిస్థితి
- కోలుకోలేని స్థితిలో వరి, ఆక్వా రైతులు, అధ్వానంగా రోడ్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా ప్రజానీకం సమస్యలతో సతమతమవుతున్నారు. పింఛన్ల రద్దు నుంచి ధాన్యం కొనుగోలు, కౌలురైతులకు రుణాలు, ఆయిల్‌పామ్ రైతులకు మొక్కలు అందని ఇలా అనేక సమస్యలతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆక్వారైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. రోడ్డు ప్రమాదాలతో ఎన్నో కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకుంటున్నాయి. నేడు జరగనున్న ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలు చర్చిస్తారా.. లేక తూతూమంత్రంగా సమావేశం ముగించేస్తారా అనే చర్చ సాగుతోంది.

అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్ ఇస్తున్నామంటూ ప్రభుత్వం చెబుతున్న గొప్పలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు సంబంధం లేకుండాపోయింది. వచ్చే జనవరి నుంచి పెన్షన్ సొమ్ము రూ.2500 నుంచి రూ.2,750కు పెంచుతున్నట్లు ప్రకటించడంతో లబ్ధిదారులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో ఏలూరు జిల్లాలో 6,500, పశ్చిమగోదావరి జిల్లాలో 6,237 మొత్తం 12,237 పింఛన్లను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు లబ్ధిదారులకు అధికారులు నోటీసులిచ్చారు. అధికారులు నోటీసు ఇచ్చిన వారంతా పింఛన్‌కు పూర్తిస్థాయిలో అర్హులే. అయితే 2016లో జరిగిన ప్రజాసాధికార సర్వేను ప్రాతిపదికగా తీసుకుని కుమారులకు కారు కొనుగోలు చేస్తే తల్లిదండ్రులకు, ఇంట్లో అన్నకు ఉద్యోగం ఉంటే ప్రత్యేక రేషన్ కార్డు ఉన్న తమ్ముడికి పింఛన్ నిలుపుదల చేయడం, భూములు లేకపోయినా ఉన్నట్లు చూపడం వంటివి పేర్కొంటూ పింఛన్ నిలుపుదల చేస్తున్నారు. హౌస్‌హోల్డ్ సర్వేలో ఆధార్ లింక్ తొలగిస్తేనే సమస్య పరిష్కారమవుతుంది. అయితే డిలిట్ ఆప్షన్‌ను ఓపెన్ చేయకుండా ప్రభుత్వం పింఛన్‌దారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో పింఛన్‌దారులు లబోదిబోమంటున్నారు. జెడ్‌పి సమావేశంలో దీనిపై కూలంకషంగా చర్చిస్తేనే పింఛన్‌దారుల సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేక చాలామంది ఇళ్ల నిర్మాణాలకు వెనుకడుతున్నారు. కొన్నిచోట్ల ఇచ్చిన స్థలాలు ఇళ్ల నిర్మాణానికి అనుకూలంగా లేకుండాపోయాయి. గత జెడ్‌పి సమావేశంలోనూ స్థానిక ప్రజాప్రతినిధులు సమస్యలను లేవనెత్తారు. ఇప్పటికీ సమస్య పరిష్కారమైన దాఖలాల్లేవు. ఈసారైనా సమస్య పరిష్కారం దిశగా చర్చలు సాగుతాయో.. లేదో వేచిచూడాలి.

దయనీయంగా ధాన్యం కొనుగోలు

రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్‌లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. ధాన్యం కొనుగోళ్లలో నూతన విధానం తేవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రబీ నాట్లు మొదలైన ఇప్పటికీ ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదు. ఏలూరు జిల్లాలో 3.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యమవ్వగా ఇప్పటి వరకు 2.62 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. దాదాపు ఇంకా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరగాల్సి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదేవిధమైన పరిస్థితి ఉంది. ధాన్యం విక్రయించిన రైతులకు సొమ్ములు సైతం 21 రోజుల్లో జమకావడం లేదని అన్నదాత గగ్గోలు పెడుతున్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై చర్చ సాగితేనే వారికి మేలు జరిగే అవకాశం ఉంది. రెండు జిల్లాల్లోనూ మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉండగా, ఇప్పటి వరకూ లక్ష మందికిపైగా మాత్రమే కౌలుకార్డులు జారీ చేశారు. ఏలూరు జిల్లాలో 43,551 కౌలుకార్డులు జారీ చేస్తే దీనిలో ఏడు వేల పైచిలుకు కార్డుదారులకు మాత్రమే రూ.46.79 కోట్లు బ్యాంకు రుణాలు అందాయి. పశ్చిమగోదావరి జిల్లాలోనూ రుణ మంజూరు పరిస్థితి ఇదేవిధంగా ఉంది. వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా చేస్తున్న కౌలురైతులకు రుణాలందక నానావస్థలు పడుతున్నారు. కౌలురైతులకు రుణాలందించే విధంగా సమావేశంలో చర్చ సాగితే రైతులకు మేలు జరుగుతుంది. పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వం రైతులకు మొక్కలు కూడా అందించని పరిస్థితి నెలకొంది. రూ.191కు అందాల్సిన మొక్కను రూ.400కుపైగా వెచ్చించి రైతులు బ్లాక్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉద్యాన శాఖ పనితీరుపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పామాయిల్ మొక్కలను వెంటనే అందించేలా సమావేశంలో నిర్ణయం తీసుకుంటే రైతులకు మేలు చేకూరుతోంది. ఆక్వా సాగులో మేత ధరలు పెరిగిపోయి పెట్టుబడి విపరీతంగా పెరిగింది. దీంతో వందకౌంట్ ధర కనీసంగా రూ.240 ఇవ్వాలని ఆక్వా రైతులు కోరగా ఆ ధర అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పినా కార్యాచరణకు నోచుకోలేదు. ఆక్వా రైతులకు ఇచ్చే విద్యుత్ సబ్సిడీకి కొత్త నిబంధనలు పెట్టడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆక్వా రైతులకు మేలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా సమావేశంలో చర్చిస్తారో.. లేదో వేచిచూడాలి.

అధ్వానంగా రోడ్లు

ప్రతి సమావేశంలోనూ అధ్వానంగా ఉన్న రోడ్లపై చర్చ జరుగుతున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. గోతులతో నిండిన రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. దీంతో ఆయా కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. రోడ్ల మరమ్మతులపై కచ్చితమైన గడువు నిర్ణయించేలా సమావేశంలో చర్చించాలని అంతా కోరుతున్నారు. ప్రజా సమస్యలపై సర్వసభ్య సమావేశంలో చర్చ జరుగుతుందో.. లేదో వేచిచూడాలి.

భవిష్యత్తు ఉద్యమాల వేదిక..

సిఐటియు రాష్ట్ర మహాసభ

- 2న జెండా ఆవిష్కరణతో మహాసభ ప్రారంభం
- అదే రోజు మధ్యాహ్నం భారీ ప్రదర్శన, బహిరంగ సభ
- హాజరుకానున్న కేరళ మంత్రి రాజీవ్, జాతీయ నేతలు
- 1నుంచి సాంస్కృతిక ప్రదర్శనలు
- అదే రోజు జిల్లాకు చేరనున్న కార్మిక చైతన్య యాత్రలు
- 2న గూడెం నుంచి భీమవరం వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, జిల్లా నేతలు

ప్రజాశక్తి - భీమవరం

భవిష్యత్ ఉద్యమాల వేదికగా సిఐటియు రాష్ట్ర 16వ మహాసభ నిర్వహించుకుంటున్నామని, ఈ మహాసభలో అన్ని వర్గాల ప్రజలూ పాల్గొని జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ తెలిపారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించి మహాసభ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై, కనీస వేతనం, ఉద్యోగ భద్రత, కార్మిక చట్టాలు అమలుకై సిఐటియు నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుతూ నిరంతరం ప్రజా ఉద్యమాల నాయకత్వం వహించే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ భీమవరం పట్టణంలో జనవరి 2, 3, 4 తేదీల్లో ఘనంగా జరగనున్నాయని తెలిపారు. మొదటి రోజు 2వ తేదీన వేలాది మంది కార్మికులతో భారీ బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. మొత్తంగా 26 జిల్లాల నుంచి 800 మంది కార్మిక, ఉద్యోగ, సంఘాల నాయకులు ప్రతినిధులుగా హాజరవుతారని పేర్కొన్నారు. కార్మిక వర్గ, ఉద్యోగ వర్గ, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులు, సామాన్య చిరుద్యోగుల కోసం, నిరుద్యోగం, ఉద్యోగ భద్రత వంటి వాటిపై చర్చించి రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడం కోసం రాష్ట్ర మహాసభ వేదికగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

2న జెండా ఆవిష్కరణతో మహాసభ ప్రారంభం

రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్

మల్టీప్లెక్స్ వెనకాల అల్లూరి శ్రీరామరాజు కళ్యాణ మండపంలో జనవరి 2న సిఐటియు జెండా ఆవిష్కరణతో రాష్ట్ర మహాసభ ప్రారంభం కానున్నట్లు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ తెలిపారు. భీమవరంలో మొట్టమొదటిసారిగా అత్యంత ప్రతిష్టాత్మకంగా మహాసభలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వందలాది మంది కార్మిక నాయకత్వం ప్రతినిధులుగా హాజరుకానున్నారని, మూడు రోజులపాటు కార్మికుల సమస్యలపై స్థూలంగా చర్చించి భవిష్యత్ ఉద్యమాలపై కార్యాచరణ రూపొందించనున్నారని తెలిపారు. ఈ నెల 28 నుంచి ఇచ్ఛాపురం, కుప్పం, శ్రీకాకుళం జిల్లా మందాడలో మూడు బస్సు యాత్రలు ప్రారంభమయ్యాయని, ఒకటో తేదీన జిల్లాలోకి తాడేపల్లిగూడెం వద్ద ప్రవేశిస్తాయని తెలిపారు. రెండో తేదీన తాడేపల్లిగూడెం నుంచి భారీ మోటార్ సైకిల్ ర్యాలీ భీమవరం వరకూ సాగుతుందని, అక్కడ ప్రదర్శనలో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఒకటో తేదీ సాయంత్రం నుంచి కేశవరావు హైస్కూల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించనున్నామని తెలిపారు. రాష్ట్రంలో కార్మికులకు ఏ సమస్యలొచ్చినా వారి రక్షణ, ఉద్యోగ భద్రత, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం సిఐటియు అనేక ఉద్యమాలు చేపట్టిందని గుర్తు చేశారు. పరిశ్రమలు మూతపడి రోడ్డున పడ్డ కార్మికుల కోసం అనేక పోరాటాలు చేసి వారికి అండగా సిఐటియు నిలించిందని గుర్తుచేశారు. మోడీ పాలనలో శ్రమకు తగ్గ వేతనమే కాకుండా కనీస వేతన చట్టాన్ని కూడా అమలు చేయకుండా నియంతృత్వ పాలన చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయకుండా కార్మికులకు అన్యాయం చేసిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై కార్మికులందరూ ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

మహాసభకు ప్రముఖులు హాజరు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయ్

భీమవరంలో సిఐటియు రాష్ట్ర మహాసభ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని, ఈ మహాసభకు కార్మిక సంఘాలకు నాయకత్వం వహిస్తున్న ప్రముఖులు హాజరుకానున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ అన్నారు. ముఖ్యఅతిథిగా కేరళ పరిశ్రమల శాఖ, న్యాయశాఖ మంత్రి పి.రాజీవ్, సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత, ప్రధాన వక్తలుగా, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ నర్సింగరావు, ఎంఎ గఫూర్, ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ, అఖిలభారత ఉపాధ్యక్షులు జి.బేబీరాణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ఉభయగోదావరి జిల్లాల నాయకులు ప్రసంగిస్తారని తెలిపారు. ఈ మహాసభలో కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, వ్యాపారవేత్తలు మేధావులు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్, నాయకులు బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

తీపి గురుతులు.. చేదు మరకలు..

కాలగమనంలో మరో సంవత్సరం కనుమరుగు కానుంది.. గతం ఒక జ్ఞాపకం.. అనుభవం.. గుణపాఠం.. అటువంటి ఎన్నో అనుభూతులు.. షడ్రుచుల సమ్మేళనమే 2022 సంవత్సరం. ఈ కాలంలో ఎన్నో విషాధ ఘటనలు చోటుచేసుకున్నాయి.. మరువలేని మధుర స్మృతులు ఆవిష్కృతమయ్యాయి. వాటిలో ముఖ్య ఘట్టాలను మరోసారి అవలోకనం చేసుకుందాం.

- పశ్చిమ డెస్క్





పందేల జోరు.. పోరాటాల హోరు.. ★ ★ ★

జనవరి: సంక్రాంతి ముసుగులో జిల్లాలో జోరుగా కోడి పందేలు, జూదాలు నిర్వహించారు. మూడు రోజులపాటు యథేచ్ఛగా సాగిన పందేల్లో వందల కోట్ల సొమ్ము చేతులు మారింది. పోలీసు శాఖతోపాటు రెవెన్యూ అధికారులు సైతం ఆ మూడురోజులు పత్తాలేకుండా పోవడం గమనార్హం.

జీతాలకు కోతపెట్టే పిఆర్‌సి వద్దంటూ ఫ్యాప్టో ఆధ్వర్యాన ఆందోళనలు మిన్నంటాయి. జిల్లా కలెక్టరేట్‌ను దిగ్బంధనం చేశారు. ప్రొబేషన్ ఖరారు చేసి, వేతన సవరణ చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు జిల్లావ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేపట్టారు.



నిరాశ.. నిరసనలు ★ ★ ★

ఫిబ్రవరి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు కేటాయింపులు లేకపోవడంతో జనం నిరాశకు గురయ్యారు. విద్యుత్ కోతలపై అన్నదాతలు రోడ్డెక్కారు. ఫ్యాప్టో పిలుపు మేరకు రివర్స్ పిఆర్‌సికి వ్యతిరేకంగా ఉపాధ్యాయుల నిరసనలు కొనసాగాయి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని విద్యార్థి, యువజన సంఘాల చలో కలెక్టరేట్‌ను పోలీసులు భగ్నం చేశారు. జిల్లా కేంద్రంగా నరసాపురాన్ని ప్రకటించాలని ఐకాస ప్రతినిధులు డిమాండ్ చేశారు. మత్స్యకార అభ్యున్నతి సభలో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేసిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సిద్ధాంతం, మార్టేరు, పాలకొల్లు మీదుగా నరసాపురం వరకూ రోడ్డుషో నిర్వహించారు.



ఊరట.. కలవరం ★ ★ ★

మార్చి: యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌లో చిక్కుకున్న జిల్లాకు చెందిన తణుకు, నరసాపురం, ఉండి తదితర ప్రాంతాలకు చెందిన వైద్య విద్యార్థులు క్షేమంగా స్వస్థలాలకు చేరుకోవడంతో తల్లిదండ్రులు ఊరట చెందారు. సర్ సిఆర్‌రెడ్డి కళాశాల 75 వసంతాల వేడుకల్లో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెంలో మూడు రోజుల్లో 16 మంది కల్తీసారా తాగి మరణించడం ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం సృష్టించింది. మృతుల కుటుంబాలను టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన, వామపక్షాల నేతలు పరామర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు నిరసిస్తూ కార్మిక సంఘాల పిలుపు మేరకు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జిల్లాలో విజయవంతమైంది.




కొత్త జిల్లాలు.. మంత్రులు..

ఏప్రిల్: కొత్త జిల్లాలు కొలువ య్యాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాగా ఏర్పాటయ్యాయి. కొంతభాగం తూర్పుగోదావరి జిల్లాలో కలిసింది. పశ్చిమగోదావరి జిల్లా మంత్రులిద్దరికీ కీలక శాఖలు దక్కాయి. ఉప ముఖ్యమంత్రిగా, దేవదాయశాఖ మంత్రిగా కొట్టు సత్యనారాయణ, పౌరసరఫరాల శాఖా మంత్రిగా కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రమాణస్వీకారం చేశారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలంలోని గొల్లపల్లిలోని స్పిన్నింగ్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. రూ.30 కోట్ల విలువైన పత్తి బేళ్లు దగ్ధమయ్యాయి. ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంలో పోరస్ రసాయన కర్మాగారంలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుని 12 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నెలలోనూ టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ జిల్లాలో పర్యటించారు.



అకాల వర్షం.. రైతన్నకు కష్టకాలం..

మే: ఉమ్మడి జిల్లాలో ఈ నెలలో రెండు దఫాలుగా ఈదురుగాలులు, అకాల వర్షాలతో రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. గణపవరంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటించారు. గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరిలో కలుపుతామని ప్రకటించారు.



ఆందోళనల పర్వం..

జూన్: జిల్లాలో 46 ఎయిడెడ్ పాఠశాలలు మూతపడడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనలు చేపట్టారు. పరిహారం పెంచే వరకూ పనులు సాగనివ్వబోమని గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూములిచ్చిన రైతులు నిరసన బాట పట్టారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాకు రాష్ట్రస్థాయిలో 12వ స్థానం లభించింది. 57.55 శాతానికి ఉత్తీర్ణత పడిపోయింది.



గోదావరి వరద కష్టాలు..

జులై: అల్లూరి సీతారామరాజు 125వ జయంత్యుత్సవం సందర్భంగా భీమవరంలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని ప్రధాని నరేంద్రమోడీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మోడీతోపాటు గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, సిఎం జగన్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, సినీ నటుడు చిరంజీవి పాల్గొన్నారు. గోదావరికి అనూహ్యంగా వచ్చిన భారీ వరదలతో విలీన మండలాలు, గోదావరి పరివాహక ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. విలీన మండలాల్లో జనం గుట్టలపై తలదాచుకోవాల్సిన దుస్థితి దాపురించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న గర్భిణులను హెలికాప్టర్‌లో తరలించారు. ఈ నెలలోనూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ జిల్లాలో పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సిఎం జగన్ పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు.




విషాద కాలం. ★ ★ ★

ఆగస్టు : స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. లింగపాలెం మండలం భోగోలులో పిగుడుపాటుకు నలుగురు వలస కూలీలు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. గణపవరం మండలం వల్లూరులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు అదుపుతప్పి పంట కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. పెనుమంట్ర మండలం గరువులో ఒక ఇంట్లో దొంగలు పడి భారీ స్థాయిలో బంగారు ఆభరణాలు అపహరించారు.



రెబెల్‌స్టార్ కన్నుమూత ★ ★ ★

సెప్టెంబర్: నటనాకౌశలంతో నలభై ఏళ్లు పైబడి వెండితెరపై వెలిగిన రెబల్‌స్టార్ కృష్ణంరాజు మృతి అభిమానులను కన్నీటి సంద్రంలో ముంచింది. కేంద్ర మంత్రి హోదాలో జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన కృషిని జనం స్మరించుకుంటూ కన్నీటి వీడ్కోలు పలికారు. సిపిఎస్ రద్దు చేయాలంటూ జిల్లావ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన తెలిపారు. సెప్టెంబర్ 1న సిపిఎస్ విద్రోహ దినం పేరుతో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పింఛనర్ల ఐక్య కార్యాచరణ సమితి (ఐకాస) ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళనలు నిర్వహించారు. అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ అమరావతి రైతులు చేపట్టిన మహాపాదయాత్ర ఏలూరు జిల్లాలోకి ప్రవేశించింది.



చోరులను పట్టేశారు.. ★ ★ ★

అక్టోబర్ : రూ.22 లక్షల విలువైన 105 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీకి గురైన వాటిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకుని బాధితులకు అందించారు. భీమవరం పట్టణంలోని బిసి బాలుర కళాశాల వసతి గృహానికి చెందిన 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఆకివీడులో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మృతి చెందడం తీవ్ర విషాదం నింపింది.

మృత్యు ఘోష..



నవంబరు : ఏలూరు మండలం కలకుర్రులో చేపల చెరువుల పనికి వెళ్లిన ఇద్దరు మహిళా కూలీలు తిరిగొస్తుండగా పడవ బోల్తా పడి మృతి చెందారు. తాడేపల్లిగూడెం మండలం కడియద్దలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడుతో ముగ్గురు మృతి చెందారు. ఉమ్మడి జిల్లాతో విడదీయలేని బంధం ఉన్న సూపర్‌స్టార్ కృష్ణ కన్నుమూశారు. నరసాపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు సిఎం జగన్ నిర్వహించారు. పెదవేగి మండలం కూచింపూడి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని 11 మంది, పాలకోడేరు పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. జిల్లాలో చంద్రబాబు రోడ్‌షో నిర్వహించారు.

ప్రాణాలు తీసిన పేలుళ్లు..



డిసెంబర్: పోలవరం ప్రాజెక్టు స్పిల్ ఛానల్‌లో పడవ బోల్తా పడి ఇద్దరు మత్స్యకారులు మృతి చెందారు. జంగారెడ్డిగూడెంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. పెంటపాడు మండలం ప్రతిపాడులోని ఫుడ్ ప్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ (3ఎఫ్) కర్మాగారంలో భారీ అగ్ని ప్రమాదంచోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒక కార్మికుడు సజీవదహనమయ్యారు.

సంక్షేమం నిరంతర ప్రక్రియ : మంత్రి కొట్టు

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

వైసిపి ప్రభుత్వంలో సంక్షేమం నిరంతర ప్రక్రియ అని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పట్టణ, రూరల్ మండలాలకు సంబంధించి కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమాన్ని నిరంతర ప్రక్రియగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. అనంతరం లబ్ధిదారులకు రైస్ కార్డులను ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు.

80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి : జెసి

ప్రజాశక్తి – భీమవరం

ధాన్యం కొనుగోళ్లలో నూతన విధానం ద్వారా ఫలితాలను సాధించామని, జిల్లాలో వివిధ శాఖల అధికారుల సమన్వయంతో 80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి మురళి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సివిల్ సప్లై అధికారులు, ఫుడ్ కార్పొరేషన్, స్టేట్ వేర్‌హౌస్, సిడబ్ల్యుసి అధికారులతో ధాన్యం కొనుగోళ్లు, బియ్యం సేకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ఖరీఫ్‌లో 3 లక్షల 42 వేల మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా, ఇప్పటివరకూ 3 లక్షల 23 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. బియ్యం సేకరణ 2 లక్షల 16 వేల మెట్రిక్ టన్నులు లక్ష్యంగా తీసుకోగా ఇప్పటివరకూ 70 వేల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు తెలిపారు.

వ్యకాస క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి– భీమవరం

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో వ్యవసాయ కార్మికుల శ్రమ పాత్ర వెలకట్టలేనిదని జిల్లా ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారి దాసి రాజు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నూతన క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బల్ల చిన్న వీరభద్రరావు, జక్కంశెట్టి వెంకటలక్ష్మి, శేషపు ఆసిరయ్య, షేక్ బాదుషా, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

న్యాయం కోరుతూ ఆమరణ నిరాహార దీక్ష

ప్రజాశక్తి– పోడూరు

తమపై కేసులు పెడుతూ తమ ఏరియాలో ఏ అభివృద్ధి కార్యక్రమం జరగకుండా అడ్డపడుతున్న పాస్టర్ విక్టర్ విజయబాబుపై అతనికి సహకరిస్తున్న విల్సన్‌పై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని గుమ్మలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని దుర్గమ్మ చెరువు ప్రాంత వాసులు సచివాలయం వద్ద శుక్రవారం ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ పైడప చినవేటకు చెందిన పాస్టర్ విక్టర్ విజయబాబు గతంలో దుర్గమ్మ చెరువు చర్చిలో పాస్టర్‌గా చేసేవారు. చర్చి విషయంలో అక్కడి వారికి వివాదం రావడంతో అతనిని చర్చికి రావొద్దని ఆ ఏరియా వారు ఒప్పుకోకపోవడంతో నాటి నుంచి అతను ఆ ప్రాంతంలో ఏ అభివృద్ధి పనులు జరిగినా ఫిర్యాదులు ఇచ్చి అడ్డుపడుతున్నాడన్నారు. దీనిపై అడిగితే తమపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అతనిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

కాపులకు రిజర్వేషన్లు అమలు చేయాలి

2 నుంచి జోగయ్య నిరవధిక నిరాహార దీక్ష

ప్రజాశక్తి – పాలకొల్లు

బిసిలకు నష్టం లేకుండా కేంద్రం ప్రకటించిన పది శాతం రిజర్వేషన్లలో ఐదు శాతం కాపులకు ఇవ్వాలని మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య డిమాండ్ చేశారు. కాపులకు రిజర్వేషన్లు అమలు చేయని జగన్ ప్రభుత్వాన్ని నిరసిస్తూ, నిలిపివేసిన ఐదు శాతం కాపు రిజర్వేషన్లను అమలు చేయాలని కోరుతూ జనవరి రెండో తేదీ నుంచి మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య పాలకొల్లులో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో జోగయ్యను ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు శుక్రవారం రాత్రి ఆయన నివాసంలో కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి దష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జోగయ్యకు ఏ ప్రమాదం ఏర్పడినా వైసిపి ప్రభుత్వం బాధ్యత వహించాలని నిమ్మల ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పలువురు కాపు నేతలు జోగయ్యను కలిశారు.

నేరాలు – ఘోరాలు

ఎంపిడిఒ కార్యాలయంలో చోరీ

8 ట్యాబ్‌లు అపహరణ

ప్రజాశక్తి – వీరవాసరం

వీరవాసరం ఎంపిడిఒ కార్యాలయంలో దొంగలు పడ్డారు. సమావేశ మందిరంలో ఉంచిన ఎనిమిది ట్యాబ్‌లు అపహరించారు. మండల పరిషత్ కార్యాలయంలోనే మండల విద్యాశాఖ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందిస్తున్న నేపథ్యంలో వీరవాసరం మండలానికి 629 ట్యాబ్‌లు విద్యాశాఖకు చేరాయి. వీటిని మండల పరిషత్ సమావేశ మందిరంలో భద్రపరిచారు. ఈ నెల 23వ విద్యార్థులు ట్యాబ్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన తరువాత సంబంధిత హైస్కూల్స్‌కు మిగిలిన ట్యాబ్‌లను అందించారు. ఈ క్రమంలో ట్యాబ్‌లు తక్కువ కావడంతో పొరపాటున ఎవరికైనా అదనంగా వెళ్లి ఉంటాయని పరిశీలించారు. కానీ ట్యాబ్‌లు ఎవరికి అదనంగా వెళ్లలేదని తేలింది. దీంతో దొంగతనం జరిగి ఉంటుందని గ్రహించి శుక్రవారం వీరవాసరం పోలీసు స్టేషన్‌కి ఫిర్యాదు చేశారు. ఎంఇఒ దేవి, ఎంపిడిఒ కార్యాలయాన్ని పరిశీలించి ప్రాథమిక దర్యాప్తు పూర్తి చేసి కేసు నమోదు చేస్తామని చెప్పినట్లు ఎస్ఐ బి.వినాయకుడు తెలిపారు. గతంలో ఎంపిడిఒ కార్యాలయం బీరువాలో కూడా అధికారులు భద్రపరిచిన డబ్బులు పోయిన సంఘటనలు జరిగాయి.

రౌడీషీటర్ హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి – భీమవరం రూరల్

ఈ నెల 23వ తేదీన భీమవరంలో జరిగిన రౌడీషీటర్ ఏసు హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణమని, ఈ కేసులో ఏడుగురిని అరెస్టు చేశామని ఎస్‌పి రవి.ప్రకాష్ తెలిపారు. టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాయలం గ్రామానికి చెందిన రౌతుల ఏసు వద్ద నుంచి దుర్గారావు కొంత సొమ్ము అప్పుగా తీసుకున్నారు. ఆ అప్పు తీర్చకపోవడంతో దుర్గారావుపై ఏసు ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో ఏసును హత్య చేయాలని దుర్గారావు నిర్ణయించుకుని ఈ నెల 23వ తేదీన బి.గోవిందరావు, డి.వంశీ, బి.విజయబాబు, ఇ.మోషేన్, ఎస్.దావీదు, బి.దుర్గారావులతో కలిసి ఏసును హత్య చేశారు. భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ ఆధ్వర్యంలో నిందితులను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు.

దోమల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి – పాలకొల్లు రూరల్

దిగమర్రు గ్రామానికి చెందిన ఆవుల ముత్యాలరావు కుమారుడు నరసింహనాయుడు(18) దోమల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల ప్రకారం.. ముత్యాలరావు ప్లాస్టిక్ డ్రమ్ముల వ్యాపారం చేస్తూ ఉంటాడు. ఈ క్రమంలో తన కుమారుడిని సరుకుల తెచ్చేందుకు విజయవాడ వెళ్లమని చెప్పాడు. దీనిపై తండ్రీకొడుకుల మధ్య మనస్పర్థలు రావడంతో మనస్తాపానికి గురైన నరసింహనాయుడు శుక్రవారం ఉదయం దోమల మందు తాగాడు. దీంతో కుటుంబసభ్యులు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.25 లక్షల విలువైన సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి – భీమవరం రూరల్

ప్రయాణ, ఇతర ముఖ్యమైన పనుల్లో ఉన్నప్పుడు సెల్‌ఫోన్లు భద్రపరుచుకోవాలని జిల్లా ఎస్‌పి పి.రవిప్రకాష్ అన్నారు. పోలీస్ గ్రౌండ్‌లో 105 సెల్‌ఫోన్లను బాధితులకు ఆయన శుక్రవారం అందజేశారు. గతంలోనే బాధితుల ఫిర్యాదు మేరకు సాంకేతిక సాయంతో సెల్‌ఫోన్లు రికవరీ చేసుకుని బాధితులకు 150 పైగా సెల్‌ఫోన్లను అందించినట్లు తెలిపారు. ఇప్పుడు 105 సెల్‌ఫోన్లను రికవరీ చేశామని తెలిపారు. వీటి విలువ రూ.25 లక్షలు ఉంటుందని తెలిపారు.

ప్రజాశక్తి – ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సమిష్టి కృషితో నేరాలకు అడ్డుకట్ట

జిల్లా ఎస్‌పి రవిప్రకాష్

ప్రజాశక్తి – భీమవరం రూరల్

నేరాలను అరికట్టడంలో జిల్లా పోలీసు యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోందని, సమిష్టి కృషితో నేరాలకు అడ్డుకట్ట వేస్తున్నామని జిల్లా ఎస్‌పి ఉప్పాడ రవిప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఎస్‌పి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వార్షిక పనితీరు, నేరాల నివేదికను తెలియజేశారు. ప్రజల భద్రత దిశగా అడుగులు వేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అరాచక శక్తులపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. మత్తు పదార్థాల వినియోగం, రవాణాను తరిమికొట్టేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. జిల్లాలో 50 గ్రామాలను గుర్తించి గ్రీన్ విలేజ్‌గా రూపాంతరం చేశామని, జిల్లాలో ఇప్పటివరకూ 3,55,055 దిశా యాప్ రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిపారు. 110 మంది గంజాయి వినియోగదారులు, 57 మంది గంజాయి వ్యాపారులను గుర్తించామని, జిల్లా నుంచి పారిపోయిన 21 మంది గంజాయి పెడ్లర్లను అరెస్ట్ చేశామని తెలిపారు. జిల్లాలో డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి 20,842 స్లాట్లు బుక్ చేయబడ్డాయని, 9662 మందికి డ్రైవింగ్ లైసెన్స్, రూ.4,75,59,655 జరిమానా విధించామని తెలిపారు. ఈ ఏడాదిలో 7,084 కేసులు నమోదయ్యాయని, 14 హత్య కేసులు, 559 దొంగతనాలు, మహిళల పట్ల నేరాలు 895 కేసులు, ఎస్‌సి, ఎస్‌టి 87 కేసులు నమోదయ్యాయని తెలిపారు. 56 మందిని అదుపులోకి తీసుకుని 128.560 కేజీల గంజాయిని సీజ్ చేశామన్నారు. ఈ సమావేశంలో అడిషినల్ ఎస్‌పి సుబ్బరాజు, సబ్ అడిషినల్ ఎస్‌పి ఎటివి రవికుమార్, డిఎస్‌పి శ్రీనాథ్, సిఐ శ్యామ్‌కుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆర్గానిక్ సాగుపై అవగాహన కల్పించాలి

జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి – పాలకోడేరు

ప్రజలంతా ఆర్గానిక్ వైపు మళ్లుతున్నారని, ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు సూచించారు. గొరగనమూడి రైతు భరోసా కేంద్రంలో భీమవరం డివిజన్‌లోని మూడు మండలాల గ్రామ వ్యవసాయ సహాయకులకు వ్యవసాయ పద్ధతులపై పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్క గ్రామ వ్యవసాయ సహాయకులూ సరైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన చేసుకొని వ్యవసాయాన్ని ఆర్గానిక్ పద్ధతిలోకి మార్చుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రాబోయే రోజుల్లో ఆర్గానిక్ పద్ధతిలో చేసే వ్యవసాయానికి ప్రభుత్వం సర్టిఫికెట్ జారీచేసి పంటను ప్రీమియం ధరకు విక్రయించుకునే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పొలంబడి ద్వారా మాత్రమే రైతులకు అవగాహన కల్పించనున్నామని, ఈ విధంగా ప్రతి గ్రామ వ్యవసాయ సహాయకులూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో భీమవరం ఇన్‌ఛార్జి ఎడిఎ వి.నారాయణరావు, సోమవారం ఎంపిపి నిమ్మల శ్రీనివాస్, ఎఒ గీతాదేవి, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణ ఎస్‌ఎఫ్‌ఐ ధ్యేయం

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పెద్దిరాజు

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ 53వ ఆవిర్భావ దినోత్సవం


భీమవరంలో మాట్లాడుతున్న పెద్దిరాజు

ప్రజాశక్తి – భీమవరం

ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావం నుంచి విద్యారంగ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు అన్నారు. భీమవరంలో ఎస్‌ఎఫ్‌ఐ 53వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను పెద్దిరాజు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు భీమవరం పట్టణ అధ్యక్షుడు భానుప్రకాష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా పెద్దిరాజు మాట్లాడుతూ గత 52 సంవత్సరాలుగా విద్యా రంగంలో ఉన్న అనేక సమస్యలపై నిస్వార్థంగా ఎస్‌ఎఫ్‌ఐ పోరాటం చేస్తోందన్నారు. ఈ పోరాటంలో ఎంతో మంది కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా సంఘం బలహీన పడకుండా, విద్యారంగం పరిరక్షణే ధ్యేయంగా ఉద్యమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతోందన్నారు. విద్యారంగంలో ఇటీవల కాలంలో అనేక మార్పులు వచ్చాయని, ఈ మార్పుల వల్ల విద్యారంగం ఇబ్బందుల్లో చిక్కుకుందన్నారు. విద్యారంగంపై ప్రభుత్వాలంబిస్తున్న విధానాలపై రాబోయే రోజుల్లో ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షులు సుజిత, లక్ష్మణ్, సహాయ కార్యదర్శి దేవేంద్ర, పట్టణ కమిటీ సభ్యులు మోహిని, స్వాతి, మౌనిక, గణేష్, యశ్వంత్, జోషప్, శ్రీను, సాయి, వరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసాపురం : విద్యార్థుల సమస్యలపై పోరాటాలకు ఎస్‌ఎఫ్‌ఐ ముందుంటుందని ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ జిల్లా అధ్యక్షులు పూరెళ్ల శ్రీనివాస్ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ 53వ ఆవిర్భావ దినోత్సవ సభ స్థానిక మీరా గ్రంథాలయంలో జరిగింది. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ పతాకాన్ని పట్టణ అధ్యక్షుడు ఎండి జాన్ ఆవిష్కరించి, అనంతరం అమరవీరుడు భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించార. ఈ సందర్భంగా పూరెళ్ల శ్రీనివాస్, ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షులు జాన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ సహాయ కార్యదర్శులు ఎం.సాయికృష్ణ, కె.మనస్విని, సభ్యులు వి.గణేష్, సనా, ఫణి, అజయ్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి– నరసాపురం టౌన్

వైఎన్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు చేస్తున్న సేవలు అభినందనీయమని వైఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.కనకారావు అన్నారు. స్థానిక మదన గోపాల స్వామి ఆలయంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.

ఆర్‌బికెల పరిశీలన

ప్రజాశక్తి – పాలకొల్లు రూరల్

మండలంలోని శివదేవుని చిక్కాలలో రైతు భరోసా కేంద్రాన్ని ఎంపిడిఒ వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిక్కాలలో 449 రైతుల నుంచి 17480 క్వింటాళ్ల ధాన్యం, బల్లిపాడు, ఆలమూరు గ్రామాలకు చెందిన 237 మంది నుంచి 15000 క్వింటాళ్ల ధాన్యం మిల్లులకు తరలించినట్లు తెలిపారు. 92 శాతం ధాన్యం ఎగుమతులు పూర్తయ్యాయని చెప్పారు.

పెనుగొండ : మండలంలో రైతు భరోసా కేంద్రాలను తణుకు సబ్ డివిజనల్ కో–ఆఫీసర్ పి.వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కానూరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కన్వీనర్లకు పలు సూచనలు

ఆకివీడు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ప్రాంగణంలో మండలంలోని ఆర్‌బికె కన్వీనర్లకు శుక్రవారం ప్రత్యేక శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వరరావు పలు సూచనలు చేశారు.

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి – కాళ్ల

వైసిపి ప్రభుత్వం ఆక్వా, వరి రైతులను ఆదుకోవాలని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు కోరారు. లక్ష్మీనరసింహపురం, బొండాడ, బొండాడపేట, జక్కరం, పెదఅమిరం, వేంపాడు, కోపల్లె గ్రామాల్లో శుక్రవారం ఉండి ఎంఎల్‌ఎ రామరాజు సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ఆక్వా రైతుల కష్టాలను తెలుసుకోవడంతో పాటు ప్రజల ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే అమరావతికి సైకిల్ యాత్ర నిర్వహిస్తామని రామరాజు తెలిపారు.

శేరేపాలెంలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

మొగల్తూరు : మండలంలోని సేరేపాలెం గ్రామంలో సర్పంచి తణుకుల మునీశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు. అనంతరం నవుడూరు వాని గరువులో రూ.8 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మొగల్తూరు, సేరేపాలెం, రామన్నపాలెం గ్రామాల్లోని విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు.

పుంత రోడ్లను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి – భీమవరం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా పుంత రోడ్లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఎన్‌ఆర్‌ఇజి ఎఎస్ పనులపై డ్వామా అధికారులతో శుక్రవారం ఆమె సమీక్షించి మాట్లాడారు. ఒక కిలో మీటర్ నిడివి గల పుంత రోడ్డు ఏర్పాటు ద్వారా 1700 రోజుల పని దినాలు కల్పించ నున్నట్లు తెలిపారు. పనిచేసిన మూడు రోజుల్లోగా వేతనాలు చెల్లింపులు జరిగేలా పర్యవేక్షించాలని డ్వామా పీడీని ఆదేశించారు.

స్పందన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి

పంట కాలువల్లో తూడు తొలగింపు, ఆక్రమణలపై స్పందన ద్వారా పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయనని, వీటిపై చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సాగునీటి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

2న సెలవు ప్రకటించాలని వినతి

ఆకివీడు :వచ్చేనెల జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో సిఐటియు రాష్ట్ర మహాసభ జరగనున్న నేపథ్యంలో తమకు రెండో తేదీన అధికారికంగా అంగన్‌వాడీలకు సెలవు ప్రకటించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారికి స్థానిక సిఐటియు నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి డి.కల్యాణి, సిఐటియు నాయులు పి.అప్పారావు, కె.తవిటినాయుడు, కృష్ణకుమారి పైడిశ్వరి, కె.దుర్గ, ప్రమీల పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి – పాలకొల్లు

కుటుంబ భవిష్యత్తుకు, సమాజ శ్రేయస్సుకు బాలికా విద్య పునాదిగా నిలుస్తుందని, బాలికలందరూ శ్రద్ధతో విద్యను అభ్యసించాలని వాకర్స్ క్లబ్ పాలకొల్లు అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు అన్నారు. పాలకొల్లు బివిఆర్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థినులు 123 మందికి రూ.ఎనిమిది వేల విలువైన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ముద్రించిన స్టడీ మెటీరియల్ క్లబ్ తరపున శుక్రవారం అందించారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి – ఆచంట

ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఆచంట సర్పంచి కోట సరోజినీవెంకటేశ్వరావు ట్యాబ్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శేఖరబాబు, విద్యా కమిటీ ఛైర్మన్ పుచ్చకాయల జ్యోతి రామకృష్ణ పాల్గొన్నారు.

పోడూరు :మండలంలోని జిన్నూరు జెడ్‌పి హైస్కూలులో ఎనిమిదో తరగతి విద్యార్థులకు జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో వైఎన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి – నరసాపురం టౌన్

ఇటీవల కాకినాడ ఐడిఎల్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వైఎన్ కళాశాల విద్యార్థి ఆశాలత జానపద సంగీతంలో ప్రథమ బహుమతి సాధించిందని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని శుక్రవారం పలువురు అభినందించారు.

విద్యార్థులు సమాజాన్ని అధ్యయనం చేయాలి

ప్రజాశక్తి – యలమంచిలి

విద్యార్థులు పుస్తకాలతో పాటు సమాజాన్ని అధ్యయనం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపి మూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని మట్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గోపి మూర్తి సౌజన్యంతో యుటిఎఫ్ ముద్రించిన పదో తరగతి మోడల్ ప్రశ్న పత్రాల పుస్తకాలను విద్యార్థులకు శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామేశ్వరపు సత్యనారాయణ, సర్పంచి చల్లా విశ్వేశ్వరరావు , యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించాలి

ప్రజాశక్తి – పెనుమంట్ర

ఈ నెల 31వ తేదీ రాత్రి జాతీయ రహదారులపై, స్థానిక రోడ్లపై నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో నియమ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

కన్వీనర్లకు అవగాహన

ఆకివీడు :ప్రభుత్వం నియమించిన సచివాలయ స్థాయి కన్వీనర్లు జనవరి ఒకటో తేదీ నుంచి ఆయా ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లాలని నియోజకవర్గ వైసిపి కన్వీనర్ పివిఎల్.నరసింహరాజు సూచించారు. స్థానిక ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ హాలు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారికి పలు అంశాలపై అవగాహన కల్పించారు.

కాళ్ల : సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సారధులు వైసిపి కోసం పని చేయాలని డిసిసిబి ఛైర్మన్, పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్ నరసింహరాజు అన్నారు. సిసలి గ్రీన్ వ్యూ హోటల్‌లో శుక్రవారం కాళ్ల మండల గ్రామ వాలంటీర్లు, కొత్తగా నియమితులైన జగనన్న సచివాలయ కన్వీనర్ల సంయుక్త సమావేశం శుక్రవారం నిర్వహించారు.

పిహెచ్‌సి సందర్శన

పాలకొల్లు రూరల్ :మండలంలోని లంకలకోడేరు పిహెచ్‌సిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మహేశ్వరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామ సచివాలయ పరిధిలో డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అడ్డాల ప్రతాప్‌కుమార్, డాక్టర్ ఎం.నవ్యజీవన్ పాల్గొన్నారు.